సాక్షి పల్నాడు

బుధవారం । 21 । జూన్ । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన కూకట్‌పల్లి వెస్ట్రన్ హిల్స్‌కు చెందిన రాలీ భానుమూర్తి కుటుంబం రూ.లక్ష విరాళంగా ఇచ్చింది.



24న జగన్నాథ రథయాత్ర

పాత గుంటూరు: గుంటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నగరంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు వుండరీక గోవింద్‌దాస్ తెలిపారు.



ఆదాయం రూ. 17.76లక్షలు

గంపలగూడెం: నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ.17.76, 939 ఆదాయం వచ్చినట్లు దేవదాయ సహాయ కమిషర్ డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు.

న్యూస్‌రీల్

కోర్టు ఆవరణలో నేడు యోగా దినోత్సవం

నరసరావుపేటటౌన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఒ.వెంకట నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ప్రతి రోజూ యోగా చేయటం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. నిర్వహించే కార్యక్రమంలో యోగా గురువుచే అవగాహన, యోగాసనాలు చేసే విధానాలు వివరిస్తారన్నారు.

యార్డుకు 46,973 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 46,973 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 44,569 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,700 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాలుకు రూ.13,500 నుంచి 23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ. 24,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,755 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల పీటీఐల బదిలీ ప్రక్రియ

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలోని 28 మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ (పీటీఐ) బదిలీ ప్రక్రియను చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం తెలిపారు. ఈనెల 23వతేదీలోగా ఇన్‌స్ట్రక్టర్స్ తమ దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. 24న దరఖాస్తుల పరిశీలన, సీనియారిటీ జాబితా ప్రకటన, 26 అభ్యంతరాల స్వీకరణ, 27 సీనియారిటీ తుది జాబితాను ప్రకటించి 28వతేదిన కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు అందిస్తామని వివరించారు. వివరాలకు అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.శ్రీనివాసరావు (9885729545)ను సంప్రదించాలని తెలిపారు.

వైద్య సిబ్బంది బదిలీ కౌన్సెలింగ్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల (ఆర్డీ) కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బంది బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి, బదిలీ ఉత్తర్వులు అందజేశారు. సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు, రేడియోగ్రాఫర్లు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌లు (ఎస్‌ఓ), మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లు (ఫిమేల్) అభ్యర్థులకు తొలిరోజు కౌన్సెలింగ్ జరిగింది. స్టాఫ్‌నర్సులు, హెడ్‌నర్సులు, ఫార్మాశిస్టులకు బుధవారం కౌన్సెలింగ్ జరుగనుంది. ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డెప్యూటీ డైరెక్టర్ అంజయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సుధీర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు పాల్, అనిల్, సుబ్బారావు, షరీఫ్ పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.10 అడుగుల వద్ద ఉంది. ఇది 149.4580 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది. ఇది 33.7181 టీఎంసీలకు సమానం.

ప్రజోపయోగా

మిన్ను విరిగి మీద పడనీ చలించని స్థితప్రజ్ఞత.. సవాలక్ష సవాళ్లు ఎదురు కానీ చెదరని అకుంఠిత దీక్ష.. వైరస్‌లు, బ్యాక్టీరియాలు ఎన్ని దాడి చేయనీ తొణకని జీవనయానం.. ఈ అసాధ్యాలన్నింటినీ సుసాధ్యం చేసే మహోన్నత శక్తి యోగా. ఇది భారతీయ పురాతన ప్రక్రియ. ఎందరో ఆచరించి ప్రయోజనం పొందిన దివ్యసాధనం. కాలక్రమేణా మనందరం మరిచిపోయిన శాస్త్రీయ వ్యాయామ సమ్మిళిత సంపద.. ఇప్పుడు మళ్లీ పురుడు పోసుకుంటోంది. జనుల నిత్య జీవనంలో భాగమవుతోంది. ఎందరో యోగాభ్యాసకులు నిరంతర సాధనతో అద్భుతాలను మన కళ్లెదుట ఆవిష్కరిస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువులు, సాధకులపై ప్రత్యేక కథనం.. – గుంటూరు డెస్క్



సూర్యలంక సముద్ర తీరంలో యోగాసనాలు వేస్తున్న గుంటూరు బజరంగ్ ఫౌండేషన్ ప్రతినిధులు

'యోగ'భాగ్యాలు

- సర్వత్రా పెరుగుతున్న ఆసక్తి
- నిత్య జీవితంలో భాగమవుతున్న వైనం
- మానసిక ప్రశాంతతకు దివ్య ఔషధం
- ఆలోచనాశక్తి, ఏకాగ్రత పెంపునకు దోహదం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవనం గందరగోళంగా మారింది. మానసిక ఒత్తిళ్లతో అందరూ సతమతమవుతున్నారు. దీర్ఘకాలిక రోగాలతో యాతన అనుభవిస్తున్నారు. విపరీత ధోరణులు పెరిగి ఆలోచనాశక్తి నశించి క్షణికావేశంలో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. దీని నుంచి బయట పడేందుకు ఉన్న ఏకైక మార్గం యోగా సాధన. రోజూ కొంత సమయం యోగాసనాలకు కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని, మనసును అదుపులో పెట్టుకోవచ్చని యోగా గురువులు చెబుతున్నారు. యోగాసనాలపై అవగాహన, ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. స్వచ్ఛంద, ఆధ్యాత్మిక సంస్థలూ ఈ మహాయజ్ఞంలో భాగస్వాములవుతున్నాయి.

ఎనిమిదేళ్లుగా ఉచిత శిక్షణ

స్వామి వివేకానంద చైతన్య భారతి(ఎస్‌వీసీబీ) ఆధ్వర్యంలో సత్తెనపల్లి సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఎనిమిదేళ్ల నుంచి ఉచిత యోగా శిక్షణ నిర్విరామంగా సాగుతోంది. యోగా గురువు జేపీఎస్ శాస్త్రీ శిక్షణ ఇస్తున్నారు. నాగార్జునగర్‌లోని సత్యధ్యాన మందిరం ఆవరణలోనూ నిత్యం సాయంత్రం మహిళలకు యోగా గురువు రోజా ఆధ్వర్యంలో శిక్షణ సాగుతోంది.



యోగాసనం వేసిన అడకా లింగరాజు కూతురు కౌసల్య

ప్రాణవాయువు



నేను ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిని. యోగా శిక్షకురాలిగా కూడా చేస్తున్నా. ఎంతో మంది మహిళలకు శిక్షణ ఇచ్చాను. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాం. ధ్యానం. ప్రాణాయామంతో ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. ఆక్సిజన్ లెవల్స్ బాగా పెరుగుతాయి. మనసు పెట్టి నమ్మకంతో చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– జి. రోజారాణి, యోగా గురువు, ఇరుకుపాలెం

రోజూ చేయమని చెబుతాను



మధుమేహం, రక్తపోటు, హార్మోన్ల ఇన్‌బ్యాలెన్స్ సమస్యలతో వచ్చే రోగులను తరచుగా చూస్తున్నా. నేను వారికి రోజూ కొద్దిసేపు నడక, యోగా చేయమని చెబుతుంటాను. అలా చేస్తే 90 శాతం రోగాల నుంచి బయటపడవచ్చు. వేలఏళ్ల క్రితమే పతంజలి మహర్షి అందించిన గొప్ప వరం యోగా.

– డాక్టర్ కె.సుబ్బారావు, ఎండో క్రైనాలజిస్ట్, గుంటూరు

వజ్రాసనంతో గ్యాస్ ట్రబుల్ దూరం



గతంలో నాకు గ్యాస్ట్రబుల్ సమస్య ఎక్కువగా ఉండేది. చాలాబాగా ఇబ్బంది పడేవాడిని. ప్రస్తుతం యోగాసనాలు వేస్తున్నాను. ముఖ్యంగా వజ్రాసనం వల్ల గ్యాస్ ట్రబుల్ దూరమైంది. ఇప్పుడు ఎంతో హుషారుగా, ప్రశాంతంగా పనులు చేసుకోగలుగుతున్నా. వ్యాసముద్ర ఆసనం వల్ల బీపీ, ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది.

–దేవరశెట్టి రవికుమార్, గోల్డ్‌అప్రైజర్, సత్తెనపల్లి

నిత్య తరగతులు



అమరావతి యోగాశ్రమాన్ని ధాన్యకటకబుద్ధ విహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు నేతృత్వంలో పదిహేనేళ్ల క్రితం స్థాపించారు. అమరావతి క్షేత్ర పురోహితుడు కౌశిక సుబ్రమణ్య శ్రీరామశర్మ నాలుగుసెంట్ల స్థలాన్ని భవన నిర్మాణం కోసం ఇచ్చారు. భవన నిర్మాణం అనంతరం రోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకూ యోగా తరగతులు గురువు గిరిస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.

కొడుకు, కూతుళ్లతో కలిసి..



బొల్లాపల్లి మండలం వెల్లటూరుకు చెందిన అడకా లింగరాజు యోగా సాధనలో రాణిస్తున్నారు. కొడుకు రామరాజు, కూతుళ్లు చైతన్య, కౌసల్యలనూ యోగా బాట పట్టించారు. రాష్ట్రంతోపాటు పక్క రాష్ట్రాల్లో ప్రదర్శనలు, శిక్షణలు నిర్వహిస్తున్నారు. వృత్తిరీత్యా రైతు అయినా, పెద్దగా చదువుకోకపోయినా యోగా నేర్చుకున్నారు. బహుమతులు, సన్మానాలు పొందారు.

కుమార్తెలతో కలిసి సాధన



ఇంటికి దీపం ఇల్లాలు. ఆమె ఆరోగ్యంగా లేకపోతే ఇబ్బందే. అందుకే నేను, నా కుమార్తెలిద్దరూ రోజూ యోగా చేస్తాం. వయస్సులో ఉండే పిల్లలకు వచ్చే చాలా ఇబ్బందులు నా బిడ్డల దరిచేరవు.

– కుమార్తెలు శ్రీలక్ష్మి, దాక్షిణ్యారెడ్డితో తల్లి జి.అరుణ, గుంటూరు

'యోగా'ను యోధుడు



యోగా, కర్రసాములో చేయితిరిగిన యోధుడు నక్కా ధర్మరాజు. ఈయనది క్రోసూరు మండలంలోని అనంతవరం. ధర్మరాజు సామాన్య రైతు. గురువు లక్ష్మయ్య వద్ద యోగా, కర్రసాము నేర్చుకున్నారు. ప్రస్తుతం ధర్మరాజు వయసు 64 ఏళ్లు. పదేళ్లుగా రాష్ట్ర, జిల్లాస్థాయి యోగాసనాల పోటీల్లో పాల్గొంటూ ఎన్నో అవార్డులు, పతకాలు సాధించారు. ఇటీవల గుంటూరులో జరిగిన వాసవీ కన్యకాపరమేశ్వరి సంస్థ నిర్వహించిన యోగా పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. దీనిని బుధవారం అందుకోనున్నారు.

ఆన్‌లైన్ ద్వారా శిక్షణ



వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలైన వై.రాజ్యలక్ష్మి నిత్య యోగా సాధనతో పట్టుసాధించారు. నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లో సాయిషా యోగా సేవా కేంద్రాన్ని స్థాపించారు. వందలాది మందికి శిక్షణ ఇచ్చారు. రాజ్యలక్ష్మి ప్రస్తుతం నాదెండ్ల మండలం కనపర్తి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. యోగాలో 2017లో మాస్టర్ డిగ్రీ చేశారు. ఇతర దేశాల్లోని ప్రవాసాంధ్రులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. పాఠశాలల్లో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.



ప్రతిభకు ప్రోత్సాహం



జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా టెన్త్, ఇంటర్మీడియెట్లలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రోత్సాహకాలు అందించారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో టెన్త్‌లో స్టేట్ మూడో ర్యాంకు సాధించిన పల్నాడు జిల్లా విద్యార్థి సంపతి వెంకటసాయితోపాటు ఇంటర్మీడియెట్‌లో ప్రతిభ కనబరిచిన ఎం.వసుధకు నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందించారు.

పేదల వైద్యానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం

- సంక్షేమ ప్రభుత్వంపై ప్రజాభిమాన వెల్లువ
- చూసి తట్టుకోలేకే ప్రతిపక్షాల కుట్రలు
- రాబోయేది కూడా వైఎస్ జగన్ ప్రభుత్వమే
- మంత్రి అంబటి, ఎంపీ లావు, ప్రభుత్వ విప్ పీఆర్కే



ఆస్పత్రి భవనాల నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి, ఎంపీ లావు, ప్రభుత్వ విప్ పీఆర్కే తదితరులు

మాచర్ల: పేదల విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. పట్టణంలో రూ.3 కోట్లతో నిర్మించిన 50 పడకల ప్రభుత్వాస్పత్రి భవనాలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో కలిసి మంత్రి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమది సంక్షేమ ప్రభుత్వమని చెప్పారు. ప్రజల కోసమే పనిచేస్తోందని స్పష్టం చేశారు. విద్యా, వైద్య పథకాలు అప్రతిహతంగా అమలవుతున్నాయని సగర్వంగా చెప్పారు. అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజాభిమానం వెల్లువెత్తుతోందని, దీనిని చూసి తట్టుకోలేకే ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం

తొలుత కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పల్నాడులో వరికపూడిసెల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతులను తీసుకొచ్చామని, రెండు వారాల్లో శంకుస్థాపన చేస్తున్నామని వివరించారు. వైఎస్ జగన్ సర్కారు ప్రజా ప్రభుత్వమని స్పష్టం చేశారు. అందుకే ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు.

వరికపూడిసెల బాధ్యత మాదే

నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించి రైతుల కలను నెరవేర్చే బాధ్యత వైఎస్సార్‌సీపీనే తీసుకుంటుందన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు కేంద్రం నుంచి అన్ని అనుమతులనూ తీసుకొచ్చామని, నిర్మాణానికి పీఆర్కే ప్రత్యేక చర్యలు తీసుకున్నారని వివరించారు. మాచర్ల పట్టణంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు కోసం పీఆర్కే సీఎం జగన్ వద్ద ఫైల్‌ని పెట్టారని, త్వరలో మంజూరవుతుందని వివరించారు. ముందుగా ఆస్పత్రికి చేరుకున్న మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ విప్ పీఆర్కే, కలెక్టర్ శివశంకర్‌కు స్థానికులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులు, డీఎంహెచ్‌ఓ రంగారావు, హాస్పిటల్ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామకోటయ్య, మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కామన బోయిన కోటయ్య, బ్యూటిఫికేషన్, గ్రీనరీ రాష్ట్ర డైరెక్టర్ ఉప్పలపాటి జాని, మార్కెట్ యార్డు చైర్మన్‌లు తాడి వెంకటేశ్వరరెడ్డి, వెలిదండి గోపాల్, మాజీ చైర్మన్‌లు బత్తుల ఏడుకొండలు, యరబోతుల శ్రీనివాసరావు, బోయ రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

తోటి కార్మికుల కళ్లెదుటే కాలిబూడిద



సున్నపు బట్టీలో కాలిపోతున్న బ్రహ్మయ్య



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- సున్నపు బట్టీలో పడి కార్మికుడి సజీవదహనం
- సహచర కూలీల హాహాకారాలు
- కుటుంబ సభ్యులు, బంధువుల కన్నీరుమున్నీరు

పిడుగురాళ్ల: తోటి కార్మికుల కళ్లెదుటే సున్నపు బట్టీలో పడి ఓ కూలి కాలిబూడిదైన హృదయ విదారక ఘటన పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో మంగళవారం జరిగింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. పిడుగురాళ్ల మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన రామిశెట్టి చిన్న బ్రహ్మయ్య(40) సున్నపు బట్టీలో పనిచేస్తుంటాడు. రోజూమాదిరే మంగళవారం ఉదయాన్నే బట్టీలో పనికి వెళ్లాడు. సున్నపు రాయిని బట్టీలో వేస్తుండగా ప్రమాదవశాత్తు లోపల పడిపోయాడు. అప్పటికే సున్నపు బట్టీ బాగా వేడిగా, భారీ ఉష్ణోగ్రతతో ఉండటంతో చిన్న బ్రహ్మయ్య కాలి బూడిదయ్యాడు. అందరూ చూస్తుండగానే ఈ ఘటన జరగడంతో తోటి కార్మికులు బాధతో హాహాకారాలు చేశారు. బట్టీ వద్ద ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ఎవరూ అక్కడకు వెళ్లేందుకు సాహసం చేయలేకపోయారు. సహచర కూలి కాలిబూడిదవుతుంటే కన్నీటిపర్యంతమయ్యారు. సమాచారం తెలుసుకున్న మృతుడి భార్య వెంకట రమణ, బంధువులు బట్టీ వద్దకు చేరుకుని గుండెలవిసేలా రోదించారు. చినబ్రహ్మయ్యకు భార్య వెంకట రమణతోపాటు, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



రామిశెట్టి చిన్న బ్రహ్మయ్య(ఫైల్)

ఆశీలు పక్కదారిపై నగర కమిషనర్ సీరియస్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుంటూరులో మార్కెట్లు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి అధికారులు చేయాల్సిన ఆశీల వసూళ్లను ప్రైవేట్ వ్యక్తులు చేయడంపై సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి నగర కమిషనర్ కీర్తి చేకూరి సీరియస్ అయినట్లు సమాచారం. ఈ విషయంపై బుధవారం రెవెన్యూ అధికారులతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. గత మూడు నెలల నుంచి మరుగుదొడ్లు, మార్కెట్ల ద్వారా కార్పొరేషన్‌కు జమ అయిన నగదుకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి రావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఈ వ్యవహారం ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందో అని రెవెన్యూ అధికారులు భయాందోళనలో ఉన్నారు.

అధికారులను కాపాడే యత్నంలో..!

అధికారులను కాపాడే యత్నంలో ప్రైవేట్ వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత కాలం తమ జేబులు నింపిన అధికారులను ఎలాగైనా కాపాడేందుకు శతవిధాలా యత్నిస్తున్నట్లు సమాచారం. పత్రికల్లో ఎన్ని కథనాలు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తరువాత కూడా ప్రైవేట్ వ్యక్తులే ఆశీలు వసూలు చేసేలా చక్రం తిప్పే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

కదిలిన రైల్వే అధికారులు

సాక్షి ఎఫెక్ట్

- సీఐ మామూళ్లపై సీరియస్
- వెండర్స్ నుంచి వివరాల సేకరణ
- నేడు విచారణకు పిలిచిన డీఆర్‌ఎం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సీఐ మామూళ్ల దందాపై రైల్వే ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. సాక్షి దినపత్రికలో మంగళవారం 'మామూళ్ల కొ'స్టాల్' శీర్షికన ప్రచురితమైన కథనానికి రైల్వే జీఎం, గుంటూరు డీఆర్‌ఎం, ఆర్పీఎఫ్ ఐజీ , డివిజన్ ఆర్పీఎఫ్ డీసీహెచ్ తీవ్రంగా స్పందించారు. సికింద్రాబాద్ ఎస్ఐబీ(సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో) అధికారులు గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుని వెండర్ల నుంచి వివరాలు సేకరించారు. స్టేట్‌మెంట్లను వీడియో రూపంలో రికార్డు చేశారు.

స్టాల్స్ నిర్వాహకులకు డీఆర్‌ఎం పిలుపు

విచారణకు బుధవారం రావాల్సిందిగా వ్యాపారులకు డీఆర్‌ఎం రామకృష్ణ సమాచారం పంపారు. స్థానిక పట్టాభిపురంలోని తన కార్యాలయంలో తనతోపాటు ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్, డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ సత్య హరప్రసాద్, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషర్ శరత్ బుధవారం ఉదయం 10.30 గంటలకు విచారణ చేపడతారని, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారితోపాటు నిర్వాహకులు, సీఐ కొట్టడంతో గాయాలపాలైన వెండర్లు రావాలని వర్తమానం పంపారు. వసూళ్లకు పాల్పడినట్టు తేలితే ఆర్పీఎఫ్ సీఐ, కానిస్టేబుల్‌పై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

మంతనాలకు సీఐ విఫలయత్నం

ఆర్పీఎఫ్ సీఐ రామయ్య, కానిస్టేబుల్ రాంబాబు వేధింపులు తాళలేక సోమవారం స్టాల్స్ నిర్వాహకులు మూకుమ్మడిగా దుకాణాలు మూసివేసి నిరసన తెలిపి ఉన్నతాధికారులను కలిసి గోడు విన్నవించిన సంగతి తెలిసిందే. స్టాల్స్ నిర్వాహకులు ఉన్నతాధికారులను కలిసి వస్తుండగా సీఐ రామయ్య వారిని ఆర్పీఎఫ్ స్టేషన్‌కు పిలిచి మంతనాలు సాగించేందుకు విఫల యత్నం చేశారు. స్టాల్స్ లేకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రైల్వే ఉన్నతాధికారులు వాటిని తెరవాలని వెండర్లను కోరారు. దీంతో స్టాల్స్‌ను సోమవారం సాయంత్రం నుంచి తెరిచారు. ఆర్పీఎఫ్ సీఐ, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు.

సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి

బాపట్ల జిల్లా జేసీ శ్రీధర్

కారంచేడు: గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పనితీరును మరింత మెరుగుపరచుకోవాల్సి ఉందని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం కారంచేడు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. కారంచేడు–3 సచివాలయాన్ని మొదట సదర్శించారు. అందుబాటులో ఉన్న అన్ని శాఖల సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో జరగనున్న జగనన్న సురక్ష పథకాన్ని ఏవిధంగా అమలు చెయ్యాలనే విధానంపై ఆరా తీశారు. ఏఎన్ఎంలు మీ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలకు అవసరమైన అన్ని రకాల సేవలు క్రమం తప్పకుండా అందించాలన్నారు. ముఖ్యంగా ఎనీమియాతో బాధపడే గర్భిణులు, చిన్నారులపై పటిష్టమైన ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. పిల్లల బరువును క్రమంగా పెంచేందుకు కృషి చెయ్యాలన్నారు. ఈ–క్రాప్ బుకింగ్‌లపై సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలను పెట్టాలని ఆయన సూచించారు.



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

అనంతరం గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది తీరుపై ఆయన సమీక్షించారు. తహసీల్దారు ఎస్.వెంకటరత్నం, ఈఓపీఆర్డీ ఆర్.రమేష్‌బాబు, డీటీ సుశీల, ఏఓ సుదీర్‌బాబు, గ్రామ కార్యదర్శి అంజయ్య, అన్ని శాఖల సిబ్బంది, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతపై దాడికి యత్నం

కారంపూడిలో ఉద్రిక్తత

- టీడీపీ నేత, వైఎస్సార్‌సీపీ నేతల మధ్య వాగ్వాదం
- పథకం ప్రకారం మోహరించిన టీడీపీ శ్రేణులు
- నిలువరించిన పోలీసులు..


ధ్వంసమైన కారును చూపుతున్న అమర్


బంగ్లా వైపు దూసుకొస్తున్న టీడీపీ కార్యకర్తలు

కారెంపూడి : పల్నాడు జిల్లా కారంపూడి మండలం వేపకంపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత బొల్నేడి అమర్‌పై టీడీపీ శ్రేణులు దాడికి యత్నించాయి. వారిని పోలీసులు నిలువరించడంతో పరిస్థితి సద్దుమణిగింది. మంగళవారం తెల్లవారుజామున బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, అమర్ మధ్య మాటామాటా పెరగడంతో ఘర్షణకు దిగారు. ఒకరినొకరు నెట్టుకొనే పరిస్థితి నెలకొంది. అక్కడున్న వారు ఇద్దరినీ శాంతింపజేశారు. అనంతరం లక్ష్మీనారాయణ తన స్వగ్రామం చింతపల్లి వెళ్లగా, అమర్ స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లాకు వెళ్లాడు. అమర్‌పై దాడి చేయాలని నిర్ణయించిన లక్ష్మీనారాయణ.. చింతపల్లి, ఒప్పిచర్ల గ్రామాల నుంచి సుమారు 150 మంది టీడీపీ కార్యకర్తలను కారెంపూడి తరలించారు. తొలుత పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపేందుకు యత్నించారు. నడిరోడ్డుపై వీరంగం సృష్టిస్తున్న టీడీపీ శ్రేణులను పోలీసులు అక్కడి నుంచి వెళ్లగొట్టారు. ఆపై ఆర్ అండ్ బీ బంగ్లాలో ఉన్న అమర్‌ను అంతమొందించేందుకు టీడీపీ శ్రేణులు తరలివెళ్లాయి. అయితే దాడి యత్నాన్ని పసిగట్టి బంగ్లాలో ఉన్నవారు తలుపులు వేసుకున్నారు. తలుపులు విరగొట్టేందుకు ప్రయత్నించారు. వీలుపడకపోవడంతో బంగ్లా ముందున్న అమర్ కారు అద్దాలను ధ్వంసం చేశారు. సీఐ జయకుమార్, ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో తరలివచ్చి బంగ్లా వద్ద ఉన్న టీడీపీ కార్యకర్తలను అక్కడ నుంచి వెళ్లగొట్టారు. బంగ్లా వద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. అనంతరం బంగ్లాలో ఉన్న అమర్ తదితరులను కూడా పోలీసులు అక్కడ నుంచి బయటకు పంపారు. ఇరువర్గాల ఫిర్యాదులను పోలీసులు స్వీకరించారు.

ఏజీపీగా గాలి జయప్రకాష్ నియామకం



నరసరావుపేట: అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా (ఏజీపీ)గా నరసరావుపేట బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది గాలి జయప్రకాష్ నియమితులయ్యారు. రెండు సీనియర్ సివిల్ న్యాయస్థానాలతోపాటు జూనియర్ సివిల్ న్యాయస్థానంలో ఏజీపీగా బాధ్యతలు నిర్వహించనున్నారు. గురజాల కోర్టుకు సైతం ఇన్‌చార్జి ఏజీపీగా ప్రభుత్వం బాధ్యతలు అప్పచెప్పింది. చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల మండలం కనపర్రు గ్రామానికి చెందిన జయప్రకాష్ 33ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. దివంగత సీనియర్ న్యాయవాది పుల్లెల దశరథరామయ్య వద్ద జూనియర్‌గా ప్రాక్టీసు ప్రారంభించి స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సహకారంతో ఏజీపీగా నియమితులై బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే గోపిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ న్యాయవాదుల సెల్‌కు నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులుగా కూడా పనిచేస్తున్నారు. పలువురు న్యాయవాదులు జయప్రకాష్‌కు అభినందనలు తెలిపారు.

అన్నను చంపిన తమ్ముడి అరెస్టు

మాచర్లరూరల్: పొలం వివాదంలో తమ్ముడిని ట్రాక్టర్‌తో గుద్ది చంపిన సంఘటనలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ షేక్ షమీముల్లా తెలిపారు. మంగళవారం రాత్రి రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 30వ తేదీన అమ్మని జమ్మలమడక గ్రామ సమీపంలో గోశాల వద్ద అన్న చల్లా కాశిరెడ్డిని ట్రాక్టర్‌తో గుద్ది కిందపడేసి రాడ్‌తో తలపై తీవ్రంగా గాయపర్చటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనలో చల్లా పార్వతీరెడ్డి, జగన్నాధం కృష్ణ, గోగిరెడ్డి, సీతారామిరెడ్డిలను అదుపులోకి తీసుకొని విచారణ జరపగా పొలం తగాదాలో అన్నను హతమార్చినట్లు తెలిపారు. కోర్టుకు హాజరుపరిచగా రిమాండ్‌కు విధించినట్లు చెప్పారు. ఈ కేసు విషయంలో చాకచక్యంగా పనిచేసి సకాలంలో నిందితులను అదుపులోకి తీసుకున్న రూరల్ సీఐ షేక్ షమీముల్లా, ఎస్ఐ టి రాజశేఖర్‌లను పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, గురజాల డీఎస్పీ పల్లపు రాజులు వారిని అభినందించారు.


మాట్లాడుతున్న రూరల్ సీఐ షేక్ షమీముల్లా

వివాహిత ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: ఉండవల్లిలో వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా ముదినేపల్లి మండలం గుర్జా గ్రామానికి చెందిన పల్లంపాటి నాగరాజు, ఉండవల్లి సెంటర్‌కు చెందిన శ్యామలా దేవికి 2013వ సంవత్సరంలో వివాహమైంది. వీరిద్దరికి ఇద్దరు సంతానం. పెళ్లయిన దగ్గర నుంచి తాగుడుకు బానిసై, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య శ్యామలాదేవిని హింసించడంతో ఉండవల్లికి వచ్చేసింది. ఇటీవల నాగరాజు తన స్వగ్రామం గుర్జా వెళ్దామని శ్యామలపై ఒత్తిడి తీసుకురావడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది.

అనాథలతో కలసి ఆదిపురుష్ చూసిన కలెక్టర్

నరసరావుపేట: స్థానిక విజేత సినిమా హాలులో మంగళవారం ఉదయం అనాథ బాలలు, వృద్ధాశ్రమం వృద్ధులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం ఆదిపురుష్ సినిమాను వీక్షించారు. ప్రముఖ వ్యాపార సంస్థ టి సిరీస్ సమర్పణలో సుమారు రూ.500 కోట్ల వ్యయంతో ప్రభాస్ హీరోగా ఓం రౌత్ దర్శకత్వం వహించిన ఆదిపురుష్ బెనిఫిట్ షో ప్రదర్శించారు. కలెక్టర్‌తో కలిసి సుమారు 420మంది పిల్లలు సినిమా చూశారు. సినిమా వీక్షణ అనంతరం పాత్రికేయలతో కలెక్టర్ మాట్లాడుతూ విజేత సినిమా హాల్ యాజమాన్యం రామాయణం ఇతివృత్తంగా తీసిన ఆదిపురుష్ సినిమా ఉచితంగా చూపించేందుకు ముందుకు రావటం అభినందనీయమన్నారు. అనాథ బాలలు ఇప్పటివరకు ఇలా సినిమా చూడలేదని తమ సంతోషాన్ని వెలిబుచ్చారని ఆయన పేర్కొన్నారు.


సినిమా వీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్లఅర్బన్: బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ (ఉర్దూ), అసిస్టెంట్ జీసీడీఓ, అసిస్టెంట్ సీఎంఓ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న అర్హులైన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్స్ ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తులను సమగ్ర శిక్ష, బాపట్ల కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎడ్యుకేషనల్ సెల్‌కు మంచి స్పందన

నరసరావుపేట: జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని విద్యార్థుల కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఎడ్యుకేషనల్ సెల్‌ను 55మంది వినియోగించుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి వారం రోజులపాటు విద్యార్థులకు పైచదువులు చదువుకునే అవసరమైన సమాచారాన్ని అందించడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించే విధంగా 'ఎడ్యుకేషన్ సెల్' ప్రారంభించారు. వినూత్నంగా ఏర్పాటు చేసిన 'ఎడ్యుకేషన్ సెల్'కు మంచి స్పందన లభిస్తోంది. మంగళవారం నాటికి సాంఘిక సంక్షేమశాఖకు సంబంధించి 38 మంది విద్యార్థులు, జిల్లా విద్యాశాఖకు చెందిన 16 మంది, వెనుకబడిన తరగతుల శాఖకు సంబంధించి ఒకరు తమ సమస్యలు నివృత్తి చేసుకొన్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

బైక్ ఢీకొని మహారాష్ట్ర యువకుడు మృతి

పిడుగురాళ్ల: బైక్ ఢీకొని మహారాష్ట్రకు చెందిన యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కామేపల్లి శివారులో మంగళవారం రాత్రి జరిగింది. సంఘటనకు సంబంధించి వివరాలు... మహారాష్ట్రకు చెందిన పర్వేజ్(21) కామేపల్లి సమీపంలో ఉన్న రంగుల ఫ్యాక్టరీలో కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే రాత్రి ఫ్యాక్టరీ నుంచి బయటకు వచ్చి కామేపల్లి వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్నాడు. మాచవరం మండలం తురకపాలెం గ్రామానికి చెందిన షేక్ కారంపూడి అల్లావలి, బషీర్‌లు ద్విచక్రవాహనంపై పిడుగురాళ్లలో కూలీ పనులు ముగించుకొని తురకపాలెం వస్తున్నారు. మార్గం మధ్యలో రంగుల ఫ్యాక్టరీ సమీపంలో పర్వేజ్‌ను ద్విచక్రవాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనం అక్కడకు చేరుకొని తీవ్ర గాయాలపాలైన అల్లావలి, బషీర్‌లను పిడుగురాళ్ల పట్టణంలోని ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన పర్వేజ్ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు.

దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

హత్య కేసుగా నమోదు చేసిన పోలీసులు


కోటేశ్వరరావు (ఫైల్)

దాచేపల్లి : దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం ఆర్అండ్‌బీ బంగ్లా వెనుక నివాసం ఉంటున్న మారబోయిన పెద్ద ప్రకాష్, దేవికల పెద్ద కుమారుడు కోటేశ్వరరావు(21) గుంటూరులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ ఎ.సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. దాచేపల్లిలోని సర్వీసింగ్ పాయింట్‌లో కోటేశ్వరరావు పనిచేస్తున్నాడు. కోటేశ్వరరావుకు గత నెల 13వ తేదీన సంధ్యతో వివాహమైంది. కోటేశ్వరరావు ఇంటికి సమీపంలో ఉండే మారబోయిన శ్రీనివాసరావు భార్యతో కోటేశ్వరరావుకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానం ఉన్నది. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కోటేశ్వరరావుపై శ్రీనివాసరావు, అతని అన్న నరసింహారావు, అక్క వేదుల లక్ష్మి ఇనుపరాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గుంటూరులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోటేశ్వరరావు మృతిచెందినట్లు సీఐ వెల్లడించారు. హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ చెప్పారు.

లింగ నిర్ధారణ చేస్తే ఉపేక్షించం

హెచ్చరించిన కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: అభివృద్ధి చెందిన సమాజంలో విద్యావంతులు, ఉన్నత వర్గాల వారు ఇప్పటికీ లింగ నిర్ధారణ పరీక్షలకు మొగ్గు చూపడం దారుణమని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో పీసీ, పీఎన్‌డీటీ చట్టంపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ కమిటీ సమావేశాన్ని మొదటి జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి సి.హెచ్.రాజగోపాలరావుతో కలిసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలను ఆర్డీఓ, వైద్యుల బృందం పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. ఆధునిక సమాజంలో ఆడా మగా తేడా లేకుండా పిల్లల్ని పెంచాలని కోరారు. మొదటి జిల్లా న్యాయసేవాధికార సంస్థ న్యాయమూర్తి సి.హెచ్.రాజగోపాలరావు మాట్లాడుతూ ఈ చట్టంపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. చట్టాన్ని అమలు చేసే క్రమంలో పోలీసుల సహకారం తీసుకోవాలని, అయితే అధికారులు, పోలీసులు ఈ చట్టంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో నూతన రిజిస్ట్రేషన్ కోసం 12, రెన్యువల్ కోసం 6, క్యాన్సిలేషన్ కోసం 2 కేంద్రాలు దరఖాస్తు చేసుకున్నాయన్నారు. సంతాన సాఫల్య కేంద్రాల రిజిస్ట్రేషన్స్ కోసం 8 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ శివరంజని, డాక్టర్ రవీంద్ర నాయక్, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూ రీసర్వేతో బహుళ ప్రయోజనాలు

గుంటూరువెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న రీ సర్వేతో ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఫేజ్–2 భాగంగా 52 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ ప్రారంభించామన్నారు. మేడికొండూరులో 11, వట్టిచెరుకూరులో 13, ప్రత్తిపాడులో 6, పెదనందిపాడులో 12 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. 1,11,400 గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించి ఇప్పటి వరకు 10 గ్రామాల్లో సర్వే చేశామని తెలిపారు. తుది జాబితాలను రెవెన్యూ అధికారులు పూర్తి చేయాలన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ గ్రౌండ్ ట్రూథింగ్ పూర్తయి పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయన్నారు. అధికారులు, సిబ్బంది ఒకటికి రెండుసార్లు సరిచూసుకుని ముందుకెళ్లాలన్నారు. దీనివల్ల ప్రజలకు చట్టపరమైన ఎన్నో అడ్డంకులు తొలగిపోతాయని అన్నారు.